క్లుప్తంగా

ఉపాధి కూలీలంతా అక్షరాస్యత సాధించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జగన్నాథరావు

నిడదవోలు రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేసే వారిని అక్షరాస్యత సాధించేలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయంలో అక్షర ఆంధ్రా ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ సిబ్బందికి మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఏపీఓ ఆకుల సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, మాస్టర్‌జీ, రిసోర్స్‌పర్సన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు



నల్లజర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లు

నల్లజర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో నుంచి రాష్ట్రీయ పోషన్ మాసోత్సవం-2025 నిర్వహిస్తున్నారు. చిన్నారుల్లో పెరుగుతున్న రక్తహీనత, పలు రకాల సమస్యల నివారణకు బుధవారం నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకూ అంగన్‌వాడీ కేంద్రాల వేదికగా ఈ కార్యక్రమం చేపట్టారు. నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. దీనిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, బాలికలను అప్రమత్తం చేసే విధంగా రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు సీడీపీఓ జి.మమ్మీ తెలిపారు.

సిలీంద్ర నాశినితో తెగుళ్ల నియంత్రణ



ప్రయోగాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు: ట్రైకోడెర్మా విరిడి సిలీంద్రనాశిని వాడడంతో వరిలో వచ్చె ఆకుపచ్చ తెగులు, అరటిలో వనామా తెగులు, వేరుకుళ్ల వంటి తెగుళ్లను నియంత్రించవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు సూచించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బయోలాజికల్ కంట్రోల్ లేబరేటరీని బుధవారం ఆయన సందర్శించారు. లేబరేటరీలో తయారు చేసిన జీవ సిలీంద్రాలను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బయోలాజికల్ కంట్రోల్ లేబరేటరీ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.చంద్రశేఖర్, కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్, వ్యవసాయాధికారులు ఎస్. కృష్ణ కిషోర్, పి. దివ్య, వి.సుమలత, ఆర్.ప్రశాంతి, జి.సత్యనారాయణ, బి.రాజారావు ఎ.మేరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



పైడిమెట్ట వద్ద గోతులు పడి బురదతో ఉన్న రోడ్డు

తాళ్లపూడి: పైడిమెట్ట వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రక్కిలంక నుంచి గోపాలపురం వెళ్లే అర్అండ్‌బీ రోడ్డు ప్రస్తుతం రోడ్డు బురద, గోతులు మయంగా మారింది. రోడ్డు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

నిడదవోలు: పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. భారీ కేక్ ను కట్ చేసిన మంత్రి దుర్గేష్ వేడుకలపై సంతోషం వ్యక్తం చేశారు.

212 మందికి వైద్య పరీక్షలు

పెరవలి: తీపర్రులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 212 మందికి పరీక్షలు చేశారు. మంత్రి కందులు దుర్గేష్ పుట్టి రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో తణుకుకు చెందిన కంటి, జనరల్, డెంటల్, విజయవాడకు చెందిన గుండె వైద్య నిపుణులు పాల్గొని సేవలందించారు.

ముంచెత్తిన వరద

- వంట పొలాలను ముంచేసిన కొవ్వాడ వరద
- 2400 ఎకరాల్లో వరి చేల మునక
- ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ
- ఏటా వరద పాలవుతున్న ఖరీఫ్ పంట
- తూతూ మంత్రంగా మరమ్మతులు
- శాశ్వత పరిష్కారం కోసం రైతుల డిమాండ్



మూడు నియోజకవర్గాల్లో విస్తరించిన కొవ్వాడ కాలువ



వెంకటాయపాలెంలో నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత



కొవ్వాడ కాలువ వరద వల్ల నీట మునిగిన చిట్యాలలోని వరి చేలు

దేవరపల్లి: కొవ్వాడ కాలువ వరద మూడు నియోజకవర్గాల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎగువ నుంచి వచ్చిన వరదతో కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీటి ఉధృతికి పంట పొలాలను ముంచెత్తింది. దాదాపు నెల రోజులు వరి చేలు నీటిలో మునిగి ఉండడంతో వరి దుబ్బులు కుళ్లిపోయి చేల సర్వనాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య ఇప్పటిది కాదని కొన్ని దశాబ్దాలుగా రైతులను వెంటాడుతోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. దశాబ్దాలుగా కాలువ అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ వరద నీటికి ప్రతి ఏటా సుమారు ఐదు వేల ఎకరాల్లో పంట నీటి పాలువుతుందని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌లో వరి పంట చేతికొచ్చేదాకా నమ్మకం ఉండదని రైతులు అంటున్నారు. వరదల సమయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూడడం తప్ప శాశ్వత పరాష్కారానికి తీసుకున్న చర్యలు లేవని మందిపడుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వార్షాలకు పోలవరం నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతంలోని కొండల్లో కురుస్తున్న వర్షాలకు కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోందని రైతులు తెలిపారు. గోపాలపురం, తాళ్లపూడి. దేవరపల్లి, చాగల్లు మండలాల్లో సుమారు 2400 ఎకరాల్లో ప్రస్తుతం వరి చేలు ముంపులో ఉన్నట్టు రైతులు తెలిపారు.

మూడు నియోజకవర్గాల్లో..

కొవ్వాడ కాలువ ఏలూరు జిల్లా పోలవరం, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో సుమారు 70 కిలో మీటర్లు విస్తరించి ఉంది. కొవ్వూరు నియోజకవర్గంలో తాళ్లపూడి, చాగల్లు మండలం చాగల్లు, నెలటూరు, దారవరం, మల్లవరం గ్రామాలు, కొవ్వూరు మండలంలో ఐ.పంగిడి, కాపవరం, గోపాలపురం నియోజకవర్గంలో గోపాలపురం మండలంలో చిట్యాల, చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, దేవరపల్లి మండలంలో గౌరీపట్నం, కొండగూడెం గ్రామాల్లో ఏటా సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింటుందని రైతులు తెలిపారు.

తూతూ మంత్రంగా పనులు

కొవ్వాడ కాలువ అభివృద్ధికి ఇటీవల రూ.3.50 కోట్లు మంజూరు చేయగా, జూన్ నెలలో కాలువ పూడికతీత పనులు చేపట్టి తూతూమంత్రంగా చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో పనులు చేసినట్టు సమాచారం. గోపాలపురం నియోజకవర్గానికి రూ.1.03 కోట్లు, కొవ్వూరు నియోజకవర్గానికి రూ.1.78 కోట్లు, పోలవరం నియోజకవర్గానికి రూ.68 లక్షలు మంజూరయ్యాయి. సుమారు 40 కిలో మీటర్ల పొడవున కాలువ పూడిక తీత పనులు చేపట్టిన అధికారులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో ఉపయోగంలేకుండా పోయిందని రైతులు అంటున్నారు. పూడిక తీసిన మట్టి వరద నీటి ప్రవాహానికి తిరిగి కాలువలోకి జారిపోతుందని రైతులు తెలిపారు.

ముంపులో వరిచేలు

భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం గోపాలపురం మండలంలో 1050 ఎకరాలు, దేవరపల్లి మండలంలో 120 ఎకరాలు, తాళ్లపూడి మండలంలో 900 ఎకరాలు, చాగల్లు మండలంలో 300 ఎకరాల వరి చేలు నీట మునిగినట్టు ఆయా మండలాల వ్యవసాయాధికారులు తెలిపారు. కాలువ ఉధృతి పెరిగినందున ముంపు పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏటా నష్టపోతున్నాం



కొవ్వాడ కాలువ ముంపుకు ప్రతి ఏటా సార్వాలో పంట నష్టపోతున్నాం. గౌరీపట్నం ప్రాంతంలో దాదాపు 600 ఎకరాల వరి పంట దెబ్బతింటుంది. కాలువ పూడికిపోయి, గుర్రపు డెక్క అల్లుకుపోవడం వల్ల వరదనీరు చేలపై పడి ముంచెత్తుతొంది. పొలాల్లో ఇసుక మేటలు, గుర్రపుడెక్క మేటలు వేస్తోంది. వీటిని తొలగించడానికి అధనపు ఖర్చు అవుతుంది. కాలువ తాత్కాలిక మరమ్మతుల వల్ల ఉపయోగంలేదు, శాశ్వత పరిష్కారం కావాలి. దాదాపు 25 ఏళ్లగా ఇదే పరిస్థితి.

– కొర్లపాటి గోపాలం, రైతు, గౌరీపట్నం

1050 ఎకరాల్లో వరి చేలు మునక



కొవ్వాడ కాలువ ముంపుకు గోపాలపురం మండలంలో 1050 ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. ప్రస్తుతం చేలు ముంపులో ఉన్నాయి. నీటి ప్రవాహం తగ్గితే చేలు కోలుకుంటాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. నీట మునిగిన వరి చేలను పరిశీలించి ప్రాథమిక అంచనాలు తయారు చేస్తున్నాం. మండలంలో వెంకటాయపాలెంలో 346 ఎకరాలు, చిట్యాలలో 600 ఎకరాలు, గుడ్డిగూడెంలో 34 ఎకరాలు, భీమోలులో 70 ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి.

– ఏసుబాబు, మండల వ్యవసాయాధికారి, గోపాలపురం

ఆంధ్రాను అమ్మాలంటున్నారు..

- నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- బల్లిపాడులో బాబు షూరిటీ మోసం గ్యారంటీ



బల్లిపాడులో మాట్లాడుతున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మాలని సాక్షాత్తు రాష్ట్ర మంత్రులు అంటున్నారని, మరి సాధ్యం కాని హామీలు ఎందుకు ఇచ్చారని, ఇది ప్రజలను చంద్రబాబు మోసం చేయడమే కాదా అని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. బల్లిపాడులో బుధవారం బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మండల నాయకులు కలిసి గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు మోసాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను ఇచ్చి గద్దెనెక్కి నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. పైగా పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రం దివాలా తీస్తుందని, ఆంధ్రాను అమ్మాలని శాఖల మంత్రులు చెప్పడం సిగ్గు చేటన్నారు. అలాంటి అప్పుడు మోసపూరిత హామీలు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చారని ఈ పథకానికే రూ.32 వేల కోట్లు అవుతుందని ఎప్పుడు అమలు చేస్తావ్‌బాబూ అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, గ్రామ సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కంఠమణి రమేష్‌బాబు, జిల్లా, రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్టా శ్రీనివాస్, పరిమి సోమరాజు, సర్పంచ్‌లు కొమ్మిరెడ్డి పరశురామారావు, గండి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు ముప్పిడి దమయంతి, ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, సిద్ధం శెట్టి కృష్ణ, కొసన శివ, పసలపూడి రాజశేఖర్, కంకిపాటి రవి, కొడమంచిలి ఋషీస్, చిట్టూరి అన్నవరం, ఉప్పులూరి సూరిబాబు, గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కమిషనర్, ఉద్యోగులు

నిడదవోలు: పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్వభావ స్వచ్ఛతా-స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో కలిసి పట్టణంలో స్వచ్ఛతా నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్వచ్ఛతాహి సేవా బ్యానర్‌ను చైర్మన్ ఆదివానారాయణ ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రజలు పూర్తి నిషేధించాలని కోరారు. అలాగే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ వేయకుండా సంబంధిత పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని, వాటిని శాస్త్రీయ పద్ధతితో నిర్వీర్యం చేస్తారని, తద్వారా వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్, మెప్మా, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి 'ఇందుకూరి'ని కలిసిన వనిత



మాజీ మంత్రితో మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి

దేవరపల్లి: మాజీ మంత్రి, అత్తిలి నియోజకవర్గం మాజీ శాసన సభ్యుడు ఇందుకూరి రామకృష్ణంరాజును బుధవారం మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనిత మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిగూడెం మండలం పిప్పరలోని ఆయన నివాస గృహంలో ఆమె కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా ప్రధాని పుట్టినరోజు వేడుకలు

తాళ్లపూడి: గ్రామంలో మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోడీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రక్కిలంక శివాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించినట్లు పార్టీ మండల అధ్యక్షులు ఇండుగుల రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇమ్మణ్ణి అనసూయ, గోకవరపు రవి, ప్రగడ సత్యరాయణ, మల్లిమొగ్గల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్బంగా బీజేపీ సీనియర్ నాయకులు రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో పట్టణంలో చర్ల సుశీల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నసమారాధన నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం, వైఎస్సార్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు పండ్లు, పాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు. నాయకులు బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం



దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ దుర్గారావు



పెరవలి పీహెచ్‌సీలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

నల్లజర్ల: స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాలతో మహిళలకు మరింత ఆరోగ్య రక్షణ లభిస్తుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్య రక్షణ కోసం బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించనున్న ప్రత్యేక వైద్యశిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆరోగ్యశిబిరంలో మహిళలు, చిన్నారులకు వైద్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. బాలింతలు, చిన్నారులలో పోషకాహార లోపాన్ని తగ్గించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లి జ్యోతి, ఎంపీడీఓ మహాలక్ష్మి మంగతాయారు, తహసీల్దారు నాయుడు, సీడీపీఓ జి.మమ్మీ, గోపాలపురం మార్కెట్ కమిటీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

256 మందికి వైద్య పరీక్షలు

దేవరపల్లి: స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ శిబిరంలో రాజమహేంద్రవరంలోని హెలియాస్ హాస్పిటల్ వైద్యాధికారి కె.లలిత, అగర్వాల్ ఆసుపత్రి నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ ప్రియాంక, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంజీవ్‌కుమార్, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. స్థానిక హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ ఎస్తేరు రాణి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నిడదవోలు (ఉండ్రాజవరం): స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ లో భాగంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ మెండే వెంకటేశ్వరరావు ప్రారంభించిన వైద్య శిబిరంలో 156 మంది మహిళలకు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.

పెరవలి: గ్రామీణ మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అప్పుడే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తెలిపారు. పెరవలి పీహెచ్‌సీలో కేంద్రం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేసి మహిళలకు అన్ని పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, సలాది కృష్ణమూర్తి సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాపాక ప్రమీళ, బొడ్డు రామాంజనేయులు వైద్యులు ఆర్ఎస్ఎస్‌వి ప్రసాద్, పి.తేజశ్రీ, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరూ రాకపోవడంతో..

తాళ్లపూడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మలకపల్లి, అన్నదేవరపేట పీహెచ్‌సీల పరిధిలో బుధవారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అయితే ఈ వైద్య శిబిరానికి ప్రజలను స్పందన కరువైంది. ఒక్కరు కూడా రాకపోవడంతో ఎమ్మెల్యే అవాక్కు అయ్యారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో చేపట్టిన కార్యక్రమానికి ఒక్క పేషెంట్ కూడా లేకపోవటంతో సిబ్బందిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమానికి ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగవాన్‌డీ కార్యకర్తలు మొత్తం 30 మందికి పైగా హాజరయ్యారు. ఒక్కొక్కరూ ఒకర్ని పిలిచినా 30 మంది వస్తే శిబిరం ఏర్పాటు చేసిన దానికి ఫలితం దక్కేది అని ఎమ్మెల్యే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అయితే అధికారులు మాత్రం లెక్కల్లో మాత్రం 160 మంది వచ్చినట్టు చెబుతున్నారు. ఈ కార్యక్రమం కోసం బయట ఎక్కడా ప్రచారం కూడా లేకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ హరికాగుప్త, తదితరులు ఉన్నారు. పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, నాయకులు ముత్యాలరావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

తాళ్లపూడి: ప్రక్కిలంక శివాలయం వద్ద బుధవారం తాళ్లపూడి మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వ కర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని 150 మంది విశ్వ బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలవేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమం పట్నాల సూరిబాబు, పట్నాల సతీష్, కిరణ్‌కుమార్, కాశీ ప్రసాద్, మహేష్, ముత్తోజు మురళి, కొసన శివ, మండల విశ్వ బ్రాహ్మణ సంఘం పెద్దలు, నాయకులు నామన పరమేశ్వరరావు, ఉడత వీరేంద్ర, ఇందుగుల రామకృష్ణ, వై.బాలకృష్ణ పాల్గొన్నారు.

మెరిసిన పేదింటి రత్నాలు

- కన్నవారి కలలు నిజం చేసిన పిల్లలు
- ఒకే ఇంట్లో ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు



తల్లి లక్ష్మితో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన దుర్గ, శ్రీనివాస్, గౌరీప్రియ

నిడదవోలు రూరల్: పట్టుదలతో చదివి తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు దీక్షతో ప్రతి క్షణం శ్రమించారు. చివరికి తళుక్కున మెరిశారు పేదింటి రత్నాలు. తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశల్ని నిజం చేశారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని తమ్మయ్యనగర్‌కు చెందిన పెనుబోతుల దుర్గ, శ్రీనివాస్, గౌరీప్రియలు పేద కుటుంబంలో జన్మించారు. చదివింది కార్పొరేట్ కళాశాలల్లో కాదు. ఇంటి పనులు చేస్తూనే.. కుటుంబానికి ఆసరాగా ఉంటూనే.. భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. శ్రమను ఆయుధంగా మార్చుకుని.. ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించారు. ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలు కూడా ప్రభుత్వ కొలువులు సాధించి పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలుచేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్లే తాము ఉన్నత చదువులు అభ్యసించామని, ప్రభుత్వ కొలువులు సాధించడమే ధ్యేయంగా చదువుకున్నామని వారు చెబుతున్నారు.

నాన్న కష్టం చూసి పట్టుదలతో..

సమిశ్రగూడెం గ్రామానికి చెందిన పెనుబోతుల శ్రీనివాసరావు కార్పెంటర్‌గా పనిచేసేవాడు. భార్య లక్ష్మి టీ అమ్ముతూ చేదోడువాదోడుగా ఉండి పనిచేస్తూ పశ్చిమడెల్టా కాలువ పక్కన చిన్నరేకులషెడ్ ఏర్పాటు చేసుకుని కొడుకు శ్రీనివాస్, కుమార్తెలు దుర్గ, గౌరీప్రియలను కష్టపడి ఉన్నత చదువులు చదివించారు. అనారోగ్యంతో 2014లో శ్రీనివాసరావు మృతి చెందాడు. అయితే తండ్రి చనిపోవడంతో ఆ బాధ దిగమింగి తినో తినకో వారంతా పట్టుదలతో కష్టపడి చదివారు. నాన్న కష్టం చూసి 'చదువుకుంటేనే భవిష్యత్తు' అనే మాటను బలంగా విశ్వసించి, ఆ ముగ్గురు పోటీపడి మరీ చదువుల్లో రాణించి ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమార్తె దుర్గ ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసి 2019లో గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్ కొలువును సాధించింది. చిన్న కుమార్తె గౌరీప్రియ ఎంటెక్ పూర్తి చేసి 2018లో రైల్వే గ్రూపు-డిలో అర్హత సాధించి విజయవాడ రైల్వేస్టేషన్‌లో 2 నెలలు అసిస్టెంట్ పాయింట్స్‌మెన్‌గా పనిచేసింది. 2019లో వార్డు సచివాలయంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా కొలువు సాధించి 10 నెలల పాటు కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో విధులు నిర్వహించింది. 2020లో ఏపీపీఎస్సీలో అర్హత సాధించి పెరవలి మండలం కానూరు అగ్రహారం పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-3గా విధులు నిర్వహిస్తోంది. కొడుకు శ్రీనివాస్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి స్థానికంగా ఒక ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసేవాడు. డీఎస్సీలో ఫిజికల్ సైన్స్ 77.37 మార్కులు సాధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 10వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ మా తల్లిదండ్రులు చదువుకోకపోయినా కష్టపడి చదివించారని, నాన్న స్ఫూర్తితోనే కష్టపడి చదివామన్నారు. అలాగే గౌరీప్రియ మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలోనే ఎంటెక్ పూర్తి చేశానన్నారు. ఇప్పటికే మూడు కొలువుల్లో అర్హత సాధించి పంచాయతీ కార్యదర్శిగా చేస్తున్నానని, సివిల్స్ సాధనే తన ధ్యేయమని తెలిపారు. అలాగే శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నానన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దాలన్న తపనతోనే డీఎస్సీలో టీచర్‌గా కొలువు సాధించానన్నారు.